
# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్ ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 04 జూన్, 2026 | పేజీలు :08




### డ్రైనేజీ ధ్వంసంపై కలెక్టర్‌కు ఫిర్యాదు
3



# పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి కొండంత అండ

### ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/ఎడపల్లి :** నిరుపేద కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కొండంత అండగా నిలుస్తున్నాయని బోధన్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న మొత్తం 53మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కాంగ్రెస్ నాయకులు పులి శ్రీనివాస్, బిల్లా రామ్మోహన్, ఈరంటి లింగం, వివిధ గ్రామాల సర్పంచ్‌లు కందగట్ల రాంచందర్, నాయకులు శంకర్ నాయుడు, తహసీల్దార్ దత్తాత్రి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# స్వచ్ఛ గావ్, సురక్షిత జలవాయు కార్యక్రమాలు నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026 సందర్భంగా స్వచ్ఛ గావ్, సురక్షిత జలవాయు కార్యక్రమాలను పెద్దపల్లి జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ గావ్, సురక్షిత జలవాయు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జూన్ 5వ తేదీ వరకు నిర్వహించాల్సిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత, సుస్థిర జీవనశైలిని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న కార్యక్రమాల జిల్లా కలెక్టర్ వివరించారు. జూన్ 2: గ్రామ పంచాయతీల పరిధిలోని కమ్యూనిటీ ఘన వ్యర్థాల నిర్వహణ ఆస్తుల స్థితిని సందర్శించి, క్షేత్రస్థాయిలో మదింపు చేయడం, సదరు వివరాలను SBM(G) IMIS పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం, జూన్ 3: గ్రామంలోని బల్క్ వేస్ట్ జనరేటర్లను (BWG) గుర్తించి, వారి జాబితాను తయారు చేయడం, జూన్ 4: అవగాహన కార్యక్రమాలు, మొక్కల పెంపకం, సామాజిక భాగస్వామ్యంతో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడం. ఇందులో మిషన్ లైఫ్, SBM(G) 2.0 అంశాలపై అవగాహన తరువాయి 2లో...



## గుడిసెలు లేని తెలంగాణ నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం
### జిల్లా కలెక్టర్ రాజర్షి షా
5

## నిజాంషుగర్ ఫ్యాక్టరీ కార్మికులను ఆదుకోవాలి



7

## రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



2

## వైద్యపరికరాలు, వైద్యుల కొరత లేకుండా చర్యలు



5

## నోటీస్ బోర్డులు ఏర్పాటు

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామ పరిధిలో ప్రధాన రహదారుల వెంట చెత్తను వేయకూడదని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసినచో జరిమానా విధించబడునని గ్రామ సర్పంచ్ కొలపాక రాధరాజు ఆధ్వర్యంలో ప్లెక్సీ నోటీస్ బోర్డులు ఏర్పాటు చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి పౌరుడు బాధ్యత వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో సలీం, పంచాయతీ కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## సురక్షిత జలవాయు కార్యక్రమాలు నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

కల్పించడం, జూన్ 5: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక గ్రామ సభ నిర్వహించడం. ఈ సభలో SWM నియమాలు, వ్యర్థాల నిర్వహణ, సాధించిన పురోగతిపై చర్చించి, వివరాలను MoPR పోర్టల్‌లో నమోదు చేయడం, మిషన్ లైఫ్ థీమ్ ద్వారా వ్యర్థాల తగ్గింపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ, నీటి సంరక్షణపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, బిసి అభివృద్ధి అధికారి రంగారెడ్డి, జిల్లా పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు పరిశీలించిన ఎపిఒ

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడ్ గ్రామ శివారులో గల నల్లచెరువులో జోరుగా సాగుతున్న ఉపాధి హామీ పనులను ఉపాధి హామీ ఏపీఓ దయామణి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల ద్వారా నల్లచెరువులో తవ్విన మట్టిని,అవసరమున్న రైతులు తమ సొంత ట్రాక్టర్ల ద్వారా పంట పొలాలకు తరలించుకునే వెసులుబాటును జిల్లా కలెక్టర్ కల్పించారని తెలిపారు. ఈ అద్భుతమైన అవకాశాన్ని గ్రామ రైతులందరూ సద్వినియోగం చేసుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు.ఎండతీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉదయాన్నే ఉపాధి హామీ కూలీలు పనులకు హాజరయ్యే విధంగా చూసిన ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్, గ్రామ సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శులు రాజేందర్ ప్రత్యేక చొరవ ఉదయాన్నే ఉపాధి హామీ పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా కృషి చేసిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ మహేష్‌తో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్ ఉన్నారు.



# రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/చొప్పదండి :** మండలంలోని కోనేరుపల్లె గ్రామం నుంచి రామడుగు మండలం కొక్కెరకుంట వరకు రూ.50 లక్షల సుడా నిధులతో నిర్మించే రోడ్డు నిర్మాణ పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంలతో కలిసి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. అనంతరం పలు గ్రామాలకు సంబంధించిన కుల సంఘ భవనాలకు ప్రొసిడింగ్ పత్రాలను అందజేసి కోనేరుపల్లే, కాట్నపల్లి గ్రామాలలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమాలకు హాజరై లబ్దిదారులకు అభినందనలు తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రుక్మాపూర్ నివాసి మ్యాకల కొమురయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు, కొండగట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, కోనేరుపల్లె గ్రామ సర్పంచ్ కాసు వేణుగోపాల రాజు, కాట్నపల్లి సర్పంచ్ గన్ను శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, మున్సిపల్ పాలకవర్గం, మార్కెట్ కమిటీ పాలకవర్గం, గ్రామశాఖ అధ్యక్షులు, కార్యకర్తలు, గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవలే మరణించిన పలువురి కుటుంబ సభ్యులను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ బుధవారం పరామర్శించారు.మండలంలోని మైదబండ గ్రామానికి చెందిన ఎర్రం మమత, ఎర్రం నర్సయ్యలు ఇటీవల మరణించగా, పుట్ట మధూకర్ వారి స్వగృహాలకు వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. తమకు తోడుగా ఉంటామని వారికి ధైర్యం చెప్పారు.అనంతరం మచ్చుపేట గ్రామానికి చెందిన అలిశెట్టి రామస్వామి,గొర్ల రాధలు ఇటీవల మృతి చెందగా.. వారి నివాసాలను ఆయన సందర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, ఆయా కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ పరామర్శల కార్యక్రమంలో పుట్ట మధూకర్ వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ అత్తె చంద్రమౌళి,మాజీ సర్పంచ్ లు ఫోరం మండల అధ్యక్షుడు నూనె కుమార్‌తో పాటు పలువురు స్థానిక బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# గాజులపల్లిలో మద్యపాన నిషేధం



ఎక్సైజ్ సిఐకి తీర్మాన పత్రం అందజేత

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా మంథని మండలం గాజులపల్లి గ్రామపంచాయతీ పరిధిలో మద్యపానాన్ని పూర్తిగా నిషేధిస్తూ గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. సర్పంచ్ కరేంగుల సుధాకర్, ఉప సర్పంచ్ కోడి సురేష్ ఆధ్వర్యంలో ప్రజలందరి అంగీకారంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో ఎలాంటి మద్యం విక్రయాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరారు. ఈ నేపథ్యంలోగ్రామపంచాయతీ పరిధిలో మద్యం అమ్మకాలను అడ్డుకోవాలని కోరుతూ మంథని ఎక్సైజ్ సీఐ రాకేష్‌కు సర్పంచ్ సుధాకర్, ఉప సర్పంచ్ సురేష్ బుధవారం తీర్మాన పత్రాన్ని అందజేశారు. గ్రామంలో శాంతిభద్రతలు,ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు.

## సిపిఆర్‌తో ప్రాణాన్ని కాపాడిన కోర్టు కానిస్టేబుల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లా కోర్టు ఆవరణలో ఇల్లంతకుంట మండలం కట్కూరు గ్రామానికి చెందిన వెంకటేశం కోర్టుకి హాజరు కాగా అకస్మాత్తుగా గుండె నొప్పితో కూలాడు అది గమనించి అక్కడే ఉన్న కొనరావుపేట పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ భాస్కర్ సకాలంలో స్పందించి సీపీఆర్ చేయడంతో బాధితుడు స్పృహలోకి రావడంతో పాటు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. కానిస్టేబుల్స్ చాకచక్యంగా వ్యవహరించడంతో వెంకటేశం ప్రాణాలతో బయటపడ్డారు.

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే, పలువురు అభినందించారు. హార్ట్ ఎటాక్ వచ్చిన వారికి తక్షణం సాయపడేలా పోలీసులకు ఉన్నతాధికారులు ఇప్పించిన సీపీఆర్ శిక్షణ ఓ నిండు ప్రాణం నిలబెట్టింది.

## ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల పోస్టులకు దరఖాస్తులు

### జిల్లా విద్యాశాఖాధికారి జి.శారద

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాలు, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు మరియు రాష్ట్ర ప్రాజెక్టు సంచాలకులు, సమగ్ర శిక్ష, తెలంగాణ, హైదరాబాద్ వారి ఉత్తర్వుల మేరకు పెద్దపల్లి జిల్లాలో 2026–27 విద్యా సంవత్సరానికి నూతనంగా 48 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి. శారదా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 48 ప్రభుత్వ ప్రీప్రైమరీ పాఠశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన 10 నెలల గౌరవ వేతనంతో ప్రీప్రైమరీ ఇన్స్ట్రక్టర్లు, ఆయాల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రీప్రైమరీ ఇన్స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ (10+2) లేదా దానికి సమానమైన అర్హత కలిగి ఉండాలని,ప్రారంభ బాల్య విద్య లేదా ప్రాథమిక బోధనలో అర్హతలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. ఆయా పోస్టుకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికలో అభ్యర్థులకు సంబంధిత ప్రీప్రైమరీ పాఠశాల ఉన్న ఆవాసం, అదే గ్రామ పంచాయతీ , అదే మండలం , అదే జిల్లా క్రమంలో ప్రాధాన్యత కల్పించబడుతుందని తెలిపారు. నోటిఫికేషన్ తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుండి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, మాజీ సైనికులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల వయో సడలింపు వర్తిస్తుందని వివరించారు. అర్హతలు కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు విద్యార్హత, వయస్సు, నివాస ధృవీకరణ తదితర సంబంధిత సర్టిఫికెట్ల ప్రతులను జతచేసి, సంబంధిత ప్రీప్రైమరీ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు 2026 జూన్ 9వ తేదీ సాయంత్రం వరకు సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి జి.శారదా కోరారు. ప్రీప్రైమరీ విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కాంగ్రెస్ గూటికి హన్మాజీపేట ఉపసర్పంచ్

**ప్రజాపక్షం/వేములవాడ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నియోజకవర్గంలో చేపడుతున్న ప్రగతి పనులు, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వేములవాడ గ్రామీణ మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ స్థానిక బస్టాండ్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఆవునూరి శంకరవ్వ శంకరయ్య ఆధ్వర్యంలో వార్డు సభ్యులు ఆవునూరి కార్తీక్, కోడం రవి, గొర్రె నర్సవ్వతో పాటు సుమారు 50 మంది ముఖ్య కార్యకర్తలతో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో ఉప సర్పంచ్ దంపతులు అధికారికంగా కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఆది శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ఆకర్షితులై అనేక గ్రామాల్లో సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోయినేని కరుణాకర్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సామ తిరుపతిరెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తీగల ఎల్లయ్య గౌడ్, డివిజన్ ఆత్మ కమిటీ మెంబర్ చెన్నాడి శ్యామల, జిల్లా డిసిసి కార్యదర్శి వకుళభరణం శ్రీనివాస్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, పార్టీ మండల నాయకులు చెన్నాడి గోవర్ధన్ రెడ్డి, చిలక ప్రభాకర్, మర్రిపల్లి మల్లేశం, ప్రజాప్రతినిధులు, హన్మాజీపేట గ్రామ ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేపు కరీంనగర్‌లో పిసిసి చీఫ్, మంత్రుల పర్యటన

### పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

**ప్రజాపక్షం/కరీంనగర్ :** ఈనెల 5న కరీంనగర్ నగరంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ హాజరుకానున్నారని చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా.మేడిపల్లి సత్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేదంర్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమాల్లో సుడా నిధులతో రాజీవ్ చౌక్ సుందరీకరణ పనుల ప్రారంభోత్సవం, స్వర్గీయ రాజీవ్ గాంధీ నూతన కాంస్య విగ్రహా ఆవిష్కరణ, ఐడిఎస్ఎంటి (పాత మున్సిపల్ గెస్ట్ హౌజ్) ప్రారంభోత్సవం, నూతన ఫుడ్ కోర్టులకు శంఖుస్థాపన తదితర కార్యక్రమాలు జరుగుతాయని పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, జిల్లా స్థాయి నామినేటేడ్ పదవులలో కొనసాగుతున్న నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్పోరేటర్లు, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

## భూపతిపూర్‌లో షీ టీమ్ అవగాహన



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు పెద్దపల్లి షీ టీమ్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ గ్రామంలో 100 రోజుల ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ సిబ్బంది మాట్లాడుతూ మహిళల భద్రత, బాలల రక్షణ,సైబర్ నేరాలు,ఆన్‌లైన్ మోసాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై మహిళలకు అవగాహన కల్పించారు. మహిళల భద్రత కోసం బస్టాండ్లు,ప్రధాన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, విద్యాసంస్థల పరిసరాల్లో షీ టీమ్ నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తోందని తెలిపారు. ఎవరైనా మహిళలు లేదా విద్యార్థినులు వేధింపులకు గురైతే భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యను తెలియజేయాలని సూచించారు. 100 లేదా 112 నంబర్లకు డయల్ చేసి పోలీసుల సహాయం పొందాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఆసియా బేగం, ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మి, షీ టీమ్ సభ్యులు సురేష్, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/రాయికల్ :** ప్రతిభతో బాసర ట్రిపుల్ ఐటీ లో సీట్లు సాధించి ఆర్థిక ఇబ్బందులు ఎదురుకుంటున్న ఇద్దరు తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా రాయికల్ మండలానికి చెందిన విద్యార్థులకు బుధవారం 50 వేల ఆర్థిక సహాయాన్ని ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక మరియు సంక్షేమ సంఘం వారు అందజేశారు. భూపతి పూర్ గ్రామ ప్రభుత్వ సెకండరీ పాఠశాల విద్యార్థులు న్యాతగిరి సంజన, దోనిపాల రాజ్ దీపక్ పదవ తరగతిలో అత్యుత్తుమమైన మార్కులు సాధించి బాసర ట్రిపుల్ ఐటీ లో స్థానం సంపాదించుకొని విద్య ఖర్చులకై ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కథనాన్ని వార్త పత్రికలో చూసిన ఈ టిసిఎ ఫౌండర్ పీచర కిరణ్ కు



మార్ ఈ టిసిఎ ద్వార సహాయం అందించాలని సభ్యలను కోరారు. స్పందించిన సభ్య లు విరాళాల ద్వార రూ.50 వేలను సమకూర్చి బుధవారం అధ్యక్ష్యుడు చీటీ జగదీశ్వర్ రావు, కోఆర్డినేటర్ ప్యూనుగోటి సురేందర్ రావు ద్వార విద్యార్థుల పరిస్థితులను కథనంగా రాసిన పత్రిక రిపోర్టర్ శ్రీకర్ సహకారంతో భూపతి పూర్ గ్రామాన్ని సందర్శించి గ్రామ పెద్దల, పాఠశాల ఉపాధ్యాయుల సమక్షంలో సంజన, రాజ్ దీపక్ లను అభినందించి సత్కరించి ఆర్థిక సహాయాన్ని అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా అద్యక్ష్యుడు జగదీశ్ ప్రభుత్వ పాఠశాల సిబ్బంది అయిన బొల్లె చిన్నయ్య ,గంగాధర్, ప్రసాద్, లక్ష్మీ నారాయణ, మహేష్, శంకర్ లను అభినందిస్తూ అందిస్తున్న బోధన తీరును ప్రశంసించి కృతజ్ఞతలు తెలుపడం జరిగింది. ఈ సేవ కార్యక్రమానికి విరాళాలు అందించిన సభ్యులకు విద్యార్థులు మరియు వారి తల్లితండ్రులు కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుర్రం భావన మహేందర్ గౌడ్, నాయకులు అనవేని వేణు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అంజన్నను దర్శించుకున్న రఘునాథ్ యాదవ్



**ప్రజాపక్షం/మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయ స్వామి వారిని బుదవారం తెలంగాణ రాష్ట్ర యాదవ సహకార కార్పొరేషన్ చైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్ దర్శించుకున్నారు.ఆయనకు దేవస్థాన అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఉపప్రధాన అర్చకులు చిరంజీవి వేదోక్త ఆశీర్వచనాలు అందించి శేషవస్త్రం కప్పి, లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సూపరిండేంట్ ఉపాధ్యాయుల చంద్ర శేఖర్, యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## బడిబాట కార్యక్రమంలో గ్రామసభ




**ప్రజా పక్షం/బీర్‌పూర్ :** జగిత్యాల జిల్లా బీరుపూర్ నర్సింహులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు బడిబాట కార్యక్రమంలో గ్రామసభను నిర్వహించినట్లు మండల విద్యాశాఖాధికారి సిరుప నాగ భూషణం తెలియజేశారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశాల కొరకై తీసుకోవలసిన నిర్ణయాలపై ఈ గ్రామసభలో చర్చించడం జరిగింది. గ్రామ సర్పంచ్ సృజన సుశీల్ గత విద్యా సంవత్సరం 10వ తరగతి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బాసర త్రిబుల్ ఐటీ ప్రవేశాలలో ఎన్నికైనందుకుగాను ఐదువేల ప్రోత్సాహక బహుమతిని ముగ్గురు విద్యార్థులకు అందించడం జరిగింది. దానితోపాటు పదవ తరగతి ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల తరపున మెమొంటోస్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ సృజన సుశీల్ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజకీయ లబ్ధి కోసం అబద్ధపు ప్రచారాలు

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** గత నాలుగు నెలల క్రితం ట్రాక్టర్ ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలను టిఆర్ఎస్ పార్టీ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాలకై రాజకీయ లబ్ధి కోసం వారిపై కపట ప్రేమ చూపుతూ అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మొగిలిపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఈ మేరకు బుధవారం మొగిలిపేట గ్రామంలోని పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబాల సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.ప్రమాదం జరిగిన రోజు ఏ ఒక్కరు బాధితుల పక్షాన పోరాడిన దాఖలు లేవని, బాధిత కుటుంబాలను అడ్డంపెట్టుకుని తమ ఉనికిని చాటుకోవడానికి పత్రిక సమావేశాలు ఏర్పాటు చేస్తూ అబద్ధపు ప్రచారాలు మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిరంతరం కృషి చేస్తున్నారని మొగిలిపేట పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం



ఎంత అవసరమో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పూర్తి చేసి ప్రారంభించామని,మీలాగా మధ్యలోనే బిల్లులు తీసుకొని అసంపూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణం నిలిపివేయలేదని ఆరోపణలు చేసే ముందు గ్రహించుకోవాలని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోల్కొండ రమేష్ వరద సురేష్ జలపతి రెడ్డి చిన్నయ్య, మహేష్, తదితరులున్నారు.

## న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటుపై హర్షం



**ప్రజాపక్షం/ధర్మపురి :** న్యాయవాదుల భద్రత, గౌరవ పరిరక్షణ మరియు స్వేచ్ఛాయుతంగా వృత్తి నిర్వహణకు భరోసా కల్పించే ఉద్దేశ్యంతో తెలంగాణ ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావడం హర్షణీయమని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) జగిత్యాల జిల్లా జాయింట్ సెక్రటరీ జాజాల రమేష్ అన్నారు.ధర్మపురి మండల కేంద్రంలో బుధవారం న్యాయవాదులతో కలిసి ఆయన మాట్లాడారు.న్యాయవాదులు న్యాయ వ్యవస్థలో కీలకమైన భాగమని, ప్రజలకు న్యాయం అందించడంలో వారి పాత్ర అత్యంత ముఖ్యమైనదని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో న్యాయవాదులపై జరిగే దాడులు, బెదిరింపులు, వేధింపులను అరికట్టేందుకు ఈ చట్టం ఎంతో దోహదపడుతుందని అన్నారు.ఈ చట్టం ద్వారా న్యాయవాదులు మరింత భద్రతతో, ఆత్మవిశ్వాసంతో తమ విధులు నిర్వహించే అవకాశం కలుగుతుందని తెలిపారు.దేశంలోనే ఆదర్శవంతమైన న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకువచ్చిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ చట్టం అమలుకు సహకరించిన తెలంగాణ సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు, మంత్రి వర్గ సభ్యులకు,శాసనసభ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.అలాగే ఈ చట్టం సాధన కోసం నిరంతరం కృషి చేసిన బార్ అసోసియేషన్లు, న్యాయవాద సంఘాల నాయకులు,న్యాయవాదులందరికీ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కలమడుగు హరిప్రసాద్,సిద్ధిని బాలలింగు పాల్గొన్నారు.

## డ్రైనేజీ ధ్వంసంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని చింతామణి చెరువు వద్ద నున్న ఫిషరీష్ స్థలంలో నూతనంగా నిర్మించిన పట్టణ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి డ్రైనేజీ ధ్వంసం చేసిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ధర్మపురి సీనియర్ జర్నలిస్ట్ సోమిశెట్టి మురళి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.పట్టణంలో రెండేళ్ల క్రితం విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభం కాగా స్థలాభావం పేరిట పర్మినెంట్ డ్రైనేజీని ధ్వంసం చేసిన కాంట్రాక్టర్ తమ ప్రహరీ గోడలకు అనుకుని తాత్కాలిక మురుగుకాల్వ ఏర్పాటు చేయడంతో దుర్వాసన వెదజల్లుతూ దోమలకు అవాసంగా మారి అపరిశుభ్రత నెలకొందని మురళి పేర్కొన్నారు. అంతేకాకుండా టెంపరరీ కాల్వ ఏర్పాటుతో మురుగునీరు తమ బోరుబావుల్లోకి చేరి నీటిని ఉపయోగించే పరిస్థితి లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. తనతోపాటు మరో ముగ్గురి పాత్రికేయుల ఇల్లు, లైబ్రరీ,ఎస్టీ



హాస్టల్ భవనం, 14 వార్డులోని 2 వేల మంది ప్రజలు డ్రైనేజీ ధ్వంసంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. వెం టనే సదరు కాంట్రాక్టర్ పై తగిన చర్యలు తీసుకుని టెంపరరీ డ్రైనేజీని మూసివేసి శాశ్వత డ్రైనేజీని తిరిగి ఏర్పాటు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని మురళి కలెక్టర్ కు ఇచ్చిన వినతిపత్రం ద్వారా కోరారు.

## ప్రి-ప్రెమరీ టీచర్ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని 3 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రిప్రైమరీ తరగతుల బోధన కోసం టీచర్, ఆయా పోస్టుల నియామకానికి మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి చెరుకు రాజన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.గొల్లపల్లి మండలంలోని చిల్వకోడూరు, చెందోలి,ఇబ్రాజ్ పల్లి గ్రామాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఈ విద్య సంవత్సరం నుండి ప్రిప్రైమరీ తరగతులను ప్రారంభించనున్న నేపథ్యంలో టీచర్, ఆయా పోస్టుల భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.ప్రీ ప్రైమరీ టీచర్ పోస్టుకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో పాటు ప్రీప్రైమరీ ట్రైనింగ్ సర్టిఫికెట్ కలిగిన మహిళ అభ్యర్థులు అర్హులు.ఆయా పోస్టుకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత కల్గిన మహిళలు అర్హులు. స్థానిక మహిళ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుంది.టీచర్ ఉద్యోగులకు నెలకు రూ.8 వేలు,ఆయా కు నెలకు రూ.6,000 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు ఎంఈఓ రాజన్న తెలిపారు.ప్రభుత్వ ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో టీచర్ ఆయా ఉద్యోగాలు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఆసక్తిగల అభ్యర్థులు అటెస్టెడ్ విద్యార్హత పత్రాలు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో జూన్ 3 నుండి 6 వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు మండలంలోని మండల విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మండలం విద్యాధికారి రాజన్న సూచించారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీకి బాడీ ఫ్రీజర్ వితరణ




**ప్రజాపక్షం/గొల్లపల్లి :** సామాజిక సేవ కార్యక్రమాలకు చేయూతనందించాలని డిస్ట్రిక్ గవర్నర్ లయన్ సింహరాజు కోదండరాం అన్నారు.గొల్లపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం డిస్ట్రిక్ గవర్నర్ లయన్ సింహరాజు కోదండరాం చేతుల మీదుగా బాడీ ఫ్రీజర్ బాక్స్ ను ప్రారంభించి గొల్లపల్లి గ్రామపంచాయతీకి అందజేశారు.గడ్డం సుశీల డాక్టర్ జగన్మోహన్ రెడ్డిలు రూ.70 వేల గల బాడీ ఫీజర్ ను లయన్స్ క్లబ్ కు విరాళంగా అందించారు .ఈ సందర్భంగా డిస్ట్రిక్ గవర్నర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు లైన్స్ క్లబ్ సేవలు విస్తరించాలని లక్ష్యంతో గొల్లపల్లిలో రెండు సంవత్సరాల క్రితం తానే క్లబ్ ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. గొల్లపల్లి క్లబ్ ద్వారా 150 మందికి కంటి ఆపరేషన్లు తదితర సేవలు చేస్తూ గొల్లపల్లి క్లబ్ ప్రజల మన్ననలను పొందుతుంది అన్నారు. క్లబ్ సేవలను మరింత విస్తరించడానికి క్లబ్బులో సామాజిక సేవకుల సంఖ్య పెరిగి సేవలను మరింత విస్తరించాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో గొల్లపల్లి లైన్స్ క్లబ్ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి, సభ్యులు సురేష్, సత్యనారాయణ,మారం రాజశేఖర్,చాడ వెంకటరమణ,ఉప సర్పంచ్ బుచ్చిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు లింగారెడ్డి, వార్డు సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించాలి




**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండలంలోని గుండంపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ డప్పుల పద్మ నరసయ్య ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులుతో కలిసి బడిబాట కరపత్రాలు ఆవిష్కరించారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చేరి నాణ్యమైన విద్యను అభ్యసించాలని గ్రామంలోని అంగన్వాడీ టీచర్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలల విద్యాభివృద్ధికి సహకరించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపెల్లి దేవయ్య, జైపాల్ రెడ్డి ,నరేష్ శ్రీనివాస్ రెడ్డి, పాల్తేపు రాజారెడ్డి, బుచ్చిరెడ్డి నారాయణ, తదితరులున్నారు.

# ఎలగందుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** ఎలగందుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జీ వెలిచాల రాజేందర్ రావు అన్నారు. కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామంలోని పెద్ద చెరువును ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మాట్లాడుతూ పెద్ద చెరువు అభివృద్ధికి రూ.10 లక్షలతో పూడికతీత, సీల్ట్ తొలగింపు పనులు చేపడతామని దీంతో చెరువు నీటి నిల్వ సామర్థ్యం పెరిగి రైతులకు, మత్స్యకారులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ విషయమై ఇప్పటికే సాగునీటి శాఖ అధికారులతో చర్చించినట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, సర్పంచ్ నిమ్మల అంజన్న, ఉప సర్పంచ్ గంటి కుమార్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



**బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేయించేందుకు కృషి**

2016లో ప్రారంభమైన ఎలగందుల బ్రిడ్జి నిర్మాణం పనులు వివిధ కారణాలతో ఆలస్యమైందని పెండింగ్ బిల్లుల సమస్య పరిష్కారంతో పనులను వేగవంతం చేసి త్వరలో పూర్తి చేసేందుకు కృషి చేస్తామని రాజేందర్ రావు స్పష్టం చేశారు. గ్రామంలో ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించి మీడియాతో మాట్లాడారు. 2016లో ప్రారంభమై 2022లో మరో ఒప్పందం ద్వారా వేర్వేరు కాంట్రాక్టర్లు పనులు చేపట్టారని బ్రిడ్జి నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల విషయాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా ఇంచార్జీ తుమ్మల నాగేశ్వర్ రావు దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. బ్రిడ్జి పూర్తయితే కరీంనగర్ వేములవాడ మధ్య ప్రయాణ దూరం తగ్గడంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడుతాయని అన్నారు. కరీంనగర్ కు త్వరగా చేరేందుకు ఈ బ్రిడ్జి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడుకోవడం మన బాధ్యత



మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్

**ప్రజాపక్షం/జమ్మికుంట:** పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ వారోత్సవాలు హుజురాబాద్ రేంజ్ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చెట్లు మానవాళి మనుగడకు ఎంతగానో ఉపయోగపడుతాయని ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసర ప్రాంతాలలో తప్పకుండా మొక్కలు నాటాలన్నారు. అమ్మ మనకు జన్మనిస్తే చెట్లు మనకు జీవనాన్ని ఇస్తున్నాయని కావున అందరూ పర్యావరణాన్ని కాపాడి పరిసరాలు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ క్షేత్ర అధికారి బి.లత, ఎఫ్ఎస్ఓ జమ్మికుంట ఎండి మహ్మద్ హుస్సేన్, ఎఫ్ఎస్ఓ హుజురాబాద్ పి.శ్రీనివాస్, ఎఫ్ఎస్ఓ కేశవపట్నం వి.ఉదయ్ కుమార్, ఎఫ్‌బిఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టుకుంటున్నారు.. వదిలేస్తున్నారు

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** అక్రమంగా నడుస్తున్న ఇసుక రవాణాపై ఉక్కు పాదం మోపాల్సిన బాధ్యత గల అధికారులు ఇలా పట్టుకొని అలా వదిలేస్తున్నారనే ఆరోపణలు బహిర్గతమవుతున్నాయి. ఇసుక అక్రమ రవాణాలో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల ట్రాక్టర్లు ఉండడంతో ఇలా దాడులు చేయగానే అలా అధికార పార్టీ నాయకులు ఫోన్లు వెళ్లుండడంతో సామాన్య ఇసుక వ్యాపారుల ట్రాక్టర్లు పట్టుకుని జరిమానాలు విధించడం కేసులు నమోదు చేయడం అధికారులకు పరిపాటిగా మారింది.బడా నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అక్కడికక్కడే వారి ట్రాక్టర్లు వదిలేస్తుండడం ఎలాంటి రాజకీయ పలుకుబడి లేని ఇసుక వ్యాపారుల ట్రాక్టర్లు పట్టుబడుతుండడంతో తమకో న్యాయం రాజకీయ నాయకులకు ఓ న్యాయమా అంటూ లబోదిబో మంటూ అధికారులు పనితీరుపై బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. ఎంతైనా మండల స్థాయిలో పనిచేస్తున్న సంబంధిత అధికారులు అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని వదిలేస్తు చూసి చూడనట్లుగానే ప్రోత్సహిస్తున్నారనే అనడంలో ఆశ్చర్యపోనక్కర్లేదు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి



**ప్రజా పక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలో ని తిమ్మాపూర్, యమపూర్, ఇబ్రహీంపట్నం, వర్షకొండ గ్రామాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆసం సంజీవ్ కుమార్ ఆధ్వర్యంలోఅధ్యాపకులు విద్యార్థుల ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులకు కళాశాల బోధన,సౌకర్యాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు,ఉపకార వేతనాలతో పాటు డిజిటల్ బోధన,సీసీటీవీ పర్యవేక్షణ,ఫేషియల్ రికగ్నిషన్ హాజరు వ్యవస్థ అందుబాటులో ఉన్న సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.అంతేకాకుండా ఈ నూతన సంవత్సరం నుండి విద్యార్థి కిట్లు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. సైన్స్ ల్యాబ్,క్రీడా సామాగ్రి, మినరల్ వాటర్ ప్లాంట్, పోటీ పరీక్షల కోసం ప్రత్యేక ఆన్‌లైన్ తరగతులు కళాశాల ప్రత్యేకతలని అధ్యాపకులు వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## 4 నుంచి 10 వరకు వార్డు సభల నిర్వహణ

**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట మున్సిపాలిటీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వార్డు సభలను జూన్ 4 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమీషనర్ జి.మల్లిఖార్జున స్వామి తెలిపారు. బుధవారం ఆయన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్‌తో కలిసి వార్డు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులలో ప్రజలతో సమన్వయం చేసుకొని వార్డు సభలను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు, జల్ సంచయ్ జల్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా రైన్ వాటర్ హార్వేస్టింగ్ నిర్మాణాలు, డ్రైన్ల పూడికతీత, శుభ్రపరిచే పనులు, రుతుపవనాల సన్నద్ధతకు కార్యచరణ ప్రణాళిక, తాగునీటి సరఫరా నిర్వహణ, నీటి నిల్వల నివారణ, పారిశుధ్య చర్యలు, రోడ్ల నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలను ప్రధాన ఎజెండాలుగా తీసుకొని పరిష్కారం చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మేనేజర్ జి.రాజిరెడ్డి, వార్డు అధికారులు పాల్గొన్నారు.



**వార్డులవారీగా షెడ్యూల్**

జూన్ 4 వార్డు నంబర్లు 12, 19, 20, 23, 24, 26
జూన్ 6 వార్డు నంబర్లు 1, 4, 6, 10, 28, 29
జూన్ 8 వార్డు నంబర్లు 5, 7, 13, 17, 18 22, 25, 27, 30
జూన్ 10 వార్డు నంబర్లు 2, 3, 8, 9, 11, 14, 15, 16, 21.

## కరీంనగర్‌వాసికి ఎక్సలెన్స్ అవార్డ్ - 2026




**ప్రజాపక్షం/కొత్తపల్లి :** ఉన్నత విద్య, పరిశోధన అకడమిక్ లీడర్‌షిప్ రంగాలలో విశిష్ట సేవలు అందించిన కరీంనగర్ కు చెందిన ప్రముఖ విద్యావేత్త డా.మంచికట్ల శ్రీకాంత్ ప్రతిష్ఠాత్మక తెలంగాణ ఎక్సలెన్స్ అవార్డు 2026 అందుకున్నారు. ఇటీవల హైదరాబాద్ లోని విశ్వేశ్వరయ్య ఆడిటోరియంలో నేషనల్ ఎక్సలెన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఇస్రో శాస్త్రవేత్త డా.టి.ఎన్.సురేష్ కుమార్, ఎం.ఎస్.ఎం.ఈ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.గోపినాథ్ రావు ఇతర ప్రముఖుల సమక్షంలో శ్రీకాంత్ కు ఈ అవార్డును ప్రధానం చేశారు. డా.శ్రీకాంత్ హైదరాబాద్‌లోని వి.ఎన్.ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డా.మంచికట్ల శ్రీకాంత్ విద్యార రంగంలో బోధన, పరిశోధన, విద్యార్థుల మార్గ దర్శకత్వం, అకాడమిక్ ప్రణాళికలు, నాణ్యమైన విద్యాభివృద్ధి కార్యక్రమాలలో విశేష కృషి చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు పరిశోధనా పత్రాలను ప్రచురించడంతోపాటు విద్యార్థుల్లో పరిశోధనా దృక్పధాన్ని పెంపొందించడం, సాంకేతిక విద్యాభివృద్ధికి నిరంతరం శ్రమించడం ద్వారా ఆయన విద్యా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. సాంకేతిక విద్యాభివృద్ధి, విద్యార్థుల మార్గదర్శకత్వంలో ఆయన చేసిన విశేష కృషికి గాను ఈ అత్యున్నత పురస్కారం దక్కింది. కరీంనగర్ జిల్లాకు చెందిన విద్యావేత్తకు ఈ రాష్ట్రస్థాయి గౌరవం లభించడం పట్ల ఆయన తల్లిదండ్రులు మంచికట్ల జనార్ధన్ భాగ్యలక్ష్మీ, సహచర అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

## వరదనీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్

**ప్రజాపక్షం/జమ్మికుంట :** జమ్మికుంట పట్టణ పరిధిలోని పలు వార్డులలో వర్షాకాలంలో వరద నీటివల్ల సమస్యలు తలెత్తకుండా ముందస్తు పనులు ప్రారంభించినట్లు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం పట్టణ పరిధిలోని ధర్మారం, కొత్తపల్లి తదితర ప్రాంతాలలో గృహవాసులకు వ్యవసాయ రైతులకు వరద నీటివల్ల సమస్యలు తలెత్తకుండా కచ్చు కాలువలు తీయడం కోసం ప్రైవేట్ జేసీబీ లీజుకు తీసుకొని ధర్మారంలో పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా పాలకవర్గం ఏర్పడి 3 నెలల కాలం పూర్తయిందని ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక సమావేశమైన పాలకవర్గం అనునిత్యం పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పోలు దివ్య బిక్షపతి,పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ అస్థిత్వాన్ని కించపరిస్తే తాటా తీస్తాం

తెలంగాణపై నీకున్నది ప్రేమ కాదు డ్రామా..

పవన్ కళ్యాణ్‌పై సుంకె ఫైర్



**ప్రజాపక్షం/చొప్పదండి:** ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడం కోసమే కాంగ్రెస్, బిజెపిలతో కలిసి ఆడుతున్న డ్రామాలలో భాగంగానే తెలంగాణలో పవన్ కళ్యాణ్ పర్యటించాడని తెలంగాణ అస్థిత్వానికి కించపరిచేలా మాట్లాడాడని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో ఆడుకుంటే తాట తీస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డ తర్వాత 11 రోజులు అన్నం తినని నువ్వు తెలంగాణ ప్రజలపై ప్రేమ ఉన్నట్లు నటిస్తావా నీ డ్రామాలు కేవలం సినిమాలకే పరిమితమని అవి నీ ఆంధ్ర ప్రాంత ప్రజలకు మాత్రమే వినసొంపుగా ఉంటాయని ఇక్కడ చాలా కంపుగా ఉంటాయని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల్లో మీరు పోటీ చేసి గెలిచిన సీట్లు ఎన్ని అని ప్రశ్నించారు. తెలంగాణ బరాబర్ మా అయ్య జాగిరేనని స్పష్టం చేశారు. తెలంగాణపై ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణ స మాజం తగిన సమయంలో మీకు బుద్ది చెబుతారని స్పష్టం చేశారు.

## జాతీయ స్థాయి బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులకు సన్మానం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన కరాటే విద్యార్థులు వి. హరిప్రీత్, ఏ. హృషికేష్ జాతీయ స్థాయి బ్లాక్ బెల్ట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు.ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఎస్ఐ నవీన్ కుమార్ కరాటే విద్యార్థులను ఘనంగా సన్మానించారు.అనంతరం శిక్షకులు ప్రవీణ్ కుమార్ మాస్టర్ సమక్షంలో డిప్లొమా ప్రశంసా పత్రాలు,పతకాలను అందజేశారు.ఈ మేరకు ఎస్ఐ నవీన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుంచే కరాటే వంటి ఆత్మరక్షణ విద్యలను అభ్యసించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కరాటే శిక్షకులు ప్రవీణ్ కుమార్, మధు కరాటే మాస్టర్లు నవీన్,విశ్వతేజ,తదితరులు పాల్గొన్నారు.

# వైద్యపరికరాలు, వైద్యుల కొరత లేకుండా చర్యలు

### ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు

**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆసుపత్రిలో వైద్య పరికరాలు, వైద్యుల కొరత లేకుండా చర్యలు చేపడుతున్నామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. బుధవారం జుక్కల్ నియోజకవర్గంలోని పిట్లం మండలకేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్మించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ భాస్కర్, ఆసుపత్రి వైద్యులు, హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు, సర్పంచు, ప్రజాప్రతినిదులు, సంబందిత అధికారులు పాల్గొన్నారు.

# పిట్లంలో డాక్టర్‌పై కేసు నమోదు

**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలకేంద్రంలోని యశోదదేవి ఆసుపత్రి డాక్టర్ శంకర్‌పై పిట్లం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావుపల్లికి చెందిన కాంత్రపల్లి సాయిలు(68) అనే వ్యక్తిని తీవ్ర జ్వరం కారణంగా వారి కుమారుడు రాజు పిట్లంలోని యశోదాదేవి ఆసుపత్రికి తీసుకువచ్చాడు. దీంతో వైద్యుడు శంకర్ ఇంజక్షన్ ఇచ్చిన 10 నిమిషాల్లోనే తమ తండ్రి సాయిలు మరణించాడని మృతుని కుమారుడు తమకు ఫిర్యాదు చేయడం జరిగిందని స్థానిక పోలీసులు పేర్కొన్నారు.

# కెరమెరి పంచాయతీ కార్యదర్శిగా షైక్ ఇర్ఫాన్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం / కెరమెరి :** కెరమెరి గ్రామ పంచాయతీ నూతన కార్యదర్శిగా షైక్ ఇర్ఫాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సిర్పూర్ యు మండలం పుల్లారా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించిన ఆయన సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెందోర్ ఆనందరావు పంచాయతీ సిబ్బందితో కలిసి నూతన కార్యదర్శికి స్వాగతం పలికారు. ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో, సమర్థవంతగా పని చేస్తూ మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పంచాయతీ పాలకవర్గంతో కలిసి గ్రామ అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# అంతర్జాతీయ సైకిల్ దినోత్సవం సందర్భంగా సైక్లింగ్ పోటీలు

**ప్రజాపక్షం/జన్నారం :** చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, సన్మార్గంలో నడవడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అటవీశాఖ ఇందన్‌పల్లి రేంజ్ ఆఫీసర్ లక్ష్మీ నారాయణ తెలిపారు. అంతర్జాతీయ సైకిల్ దినోత్సవం సందర్భంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం అటవీశాఖ ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైక్లింగ్ వల్ల కలిగే ప్రయోజనాలపై యువతకు అవగాహన కల్పించారు. రోజూ సైకిల్ తొక్కడం వల్ల శరీరానికి మంచి వ్యాయామం లభించడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని చెప్పారు. గుండె ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు బరువు తగ్గడానికి, ప్రయాణ ఖర్చులు ఆదా చేసుకోవడానికి సైక్లింగ్ ఉపయోగపడుతుందని వివరించారు. రోజుకు 15 నుంచి 30 నిమిషాలు సైకిల్ తొక్కడం వల్ల ఒత్తిడి, ఆందోళనలు తగ్గి మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. సైకిల్ వినియోగం వల్ల ఎలాంటి కాలుష్యం ఉండదని, కర్బన ఉద్గారాలను తగ్గించడంలో



సహాయపడుతుందని పేర్కొన్నారు. అటవీ రక్షణ, వన్యప్రాణుల సంరక్షణలో యువత భాగస్వామ్యం అవసరమని, అడవులు సంరక్షితంగా ఉన్నప్పుడే పర్యావరణం మెరుగ్గా ఉంటుందని తెలిపారు. ఈ పోటీల్లో కలమడుగు, ఇందన్‌పల్లి ప్రాంతాలకు చెందిన యువత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రేంజ్ ఆఫీస్ సిబ్బంది శేషారావు, తన్వీర్ పాషా, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**ప్రజాపక్షం / రెబ్బెన :** తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లిన ఉద్యమకారులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్మీర బాబూరావు డిమాండ్ చేశారు. రెబ్బెన మండలం గోలేటి గ్రామంలో మలిదశ ఉద్యమంలో జైలుకు వెళ్లిన ఉద్యమకారులు అజ్మీర బాబూరావు, బోగే ఉపేందర్, కోట రాజయ్య, దుర్గం రవీందర్, సొగల వామన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచివేసేందుకు కుట్రలు చేసి అక్రమ కేసులతో జైలుకు పంపిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం ఉద్యమకారులకు పెన్షన్, భూమి, ఇందిరమ్మ



ఇళ్లు కేటాయించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుర్గం తిరుపతి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పంబాల శ్రీనివాస్, నాయకులు అరుణ్, సాంబ గౌడ్, పంచాయితీ కార్యదర్శి రవీందర్, కారోబారి సుధాకర్, ప్రదీప్, గోరుసింగ్ పాల్గొన్నారు.

# బంబార ఆశ్రమ పాఠశాలలో బడిబాట ప్రారంభం

**ప్రజాపక్షం/వాంకిడి :** విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి చిన్నారి చదువుకు దూరం కాకుండా చూడాలని గ్రామ సర్పంచ్ బెండరే కృష్ణజీ పిలుపునిచ్చారు. వాంకిడి మండలంలోని బంబారా గ్రామపంచాయతీ పరిధిలో గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంను ఉపసర్పంచ్ జాడే సంతోష్, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి ప్రసన్నతో కలిసి బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి పాఠశాల వయస్సు గల ప్రతి బాలబాలికను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, వసతి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డ్రాపౌట్ విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, విద్య పట్ల అవగాహన కల్పించడం బడిబాట కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి చిన్నారి విద్యను అభ్యసించి సమాజ అభివృద్ధికి తోడ్పడేలా అందరూ కృషి చేయాలని కోరారు.ఉపాధ్యాయులు మెస్రం దాదాజీ, గేడం వినోద్ కుమార్, వార్డు సభ్యులు కొట్నాక రాంశావు, డికొండ మహేష్, మెంగ్రే తిరుపతి, జాడే శ్రీరామ్, మెస్రం పల్లవి, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ కూలీలకు పులిహోర పంపిణీ

**ప్రజాపక్షం/వాంకిడి :** గ్రామాభివృద్ధిలో ఉపాధి హామీ కూలీల పాత్ర ఎంతో ముఖ్యమైందని, వారి సంక్షేమం కోసం గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని గ్రామ సర్పంచ్ అమృత తెలిపారు. వాంకిడి మండలంలోని ఖిరిడి గ్రామపంచాయతీ పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు నిర్వహిస్తున్న కూలీలకు సర్పంచ్ ఆధ్వర్యంలో బుధవారం పులిహోర పంపిణీ చేశారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఉపాధి హామీ పనులకు హాజరవుతున్న కూలీల ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండుటెండల్లో కూడా గ్రామాభివృద్ధి పనులను అంకితభావంతో నిర్వహిస్తున్న కూలీల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. కూలీలకు అవసరమైన తాగునీరు, నీడ, ఆహారం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం ఉప సర్పంచ్ సాగర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం గ్రామీణ పేద కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పిస్తోందని, కూలీలకు ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారికి మరింత ఉత్సాహం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



# పరమేశ్వర్ కోలేట్కర్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్:** కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్‌గా నియమితులైన పరమేశ్వర్ కోలేట్కర్‌ను భారతీయ బౌద్ధ మహాసభ, పలు దళిత సంఘాల ఆధ్వర్యంలో కైలాష్ నగర్‌లోని అశోక బుద్ధ విహార్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ప్రధన కార్యదర్శి రత్నాజాడే ప్రజ్ఞ కుమార్ మాట్లాడుతూ సామాజిక న్యాయం, బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం పరమేశ్వర్ కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం పరమేశ్వర్ కోలేట్కర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ, ఎస్సీ వర్గాల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకలు సోగల సుదర్శన్, విఠల్, దయానంద్, హుకే దైవశాల, రాజు మస్కే పాల్గొన్నారు.


# గుడిసెలు లేని తెలంగాణ నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/ ఆదిలాబాద్:** ప్రజాపాలనప్రగతి ప్రణాళిలో భాగంగా నిర్వహించే గ్రామ, వార్డు సభలను అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుండి అధికారులతో గూగుల్ మీట్ ద్వారా ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12 వరకు నిర్వహించ తలపెట్టిన గ్రామసభలను విజయవంతం చేయాలనారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి లోపాలు జరగకుండా చూడాలని, గుడిసెలు లేని తెలంగాణ నిర్మాణానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. వర్షాలు, వరదల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను అప్రమత్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రమాదకర తీగలు, స్తంభాలను సరిచేయాలన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలని విద్యాశాఖను ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈఓ రవి, డిఆర్‌డిఓ రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

# జొన్నలు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

### జిసిసిడివిజనల్ మేనేజర్ సందీప్ కుమార్

**ప్రజాపక్షం/ఉట్నూర్:** గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో జొన్నలు వర్షానికి తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీసీసీ డివిజనల్ మేనేజర్ గుడిమల్ల సందీప్ కుమార్ తెలిపారు. మంగళవారం జీసీసీ ఆధ్వర్యంలో నార్నూర్ మండలం తడిహత్నూర్, గాదిగూడ మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు చూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని రైతులు తీసుకొచ్చిన జొన్నలు తడవకుండా టార్పాలిన్ పట్టాలతో కప్పి ఉంచాలని, రైతులు నష్టపోకుండా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను ఆయన పరిశీలించారు. జీసీసీ సీనియర్ మేనేజర్ సంతోష్‌కుమార్, అకౌంటెంట్ గోవిందరావు, సెంటర్ ఇన్‌చార్జులు ప్రేమ్, మారుతి పాల్గొన్నారు.



## జైనూర్ ఎఎస్ఐ ముండే ఉద్దవ్ బదిలీ



**ప్రజాపక్షం/జైనూర్ :** జైనూర్ పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ముండే ఉద్దవ్‌ను తిర్యాణి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం జైనూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో కలిసి ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. జైనూర్‌లో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారంలో ఆయన ఎంతో కృషి చేశారని సిబ్బంది కొనియాడారు. తిర్యాణిలోనూ సమర్థవంతంగా విధులు నిర్వహించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రహదారిపై గేదె మృతదేహం ప్రయాణికులకు ఇబ్బందులు



**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :** ప్రధాన రహదారిపై ఉన్న గేదె మృతదేహాన్ని తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలంలోని పోతేపల్లి గ్రామ శివారు కాగజ్‌నగర్–పెంచికల్‌పేట్ ప్రధాన రహదారిపై మూడు రోజుల క్రితం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒక గేదె అక్కడికక్కడే మృతి చెందింది. ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై మృతదేహం అలాగే ఉండిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించే వారికి ఇది ముప్పుగా మారిందని, ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో పర్యావరణ కాలుష్యం, ప్రజారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టాల్సిన గ్రామ పంచాయతీ యంత్రాంగం, సంబంధిత అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి గేదె మృతదేహాన్ని రహదారిపై నుండి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాల భీమ్‌గల్‌లో బుధవారం ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశామని ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని, ఇవే కాకుండా కలాశాలలో ప్రతిఒక్క విద్యార్థి పాఠాలు విని ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచనలు చేస్తూ ప్రతిరోజు క్రమం తప్పకుండా విద్యార్థులు కళాశాలకు హాజరు కావలని సూచించారు.

## సింగరేణి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**ప్రజాపక్షం / కాసిపేట :** సింగరేణి కార్మికుల పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాసిపేట2 గనిపై టిబీజీకేఎస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గని మేనేజర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కారుకూరి తిరుపతి, సారంగపాణి మాట్లాడుతూ ప్రతి నెల రెండు మెడికల్ బోర్డులను నిర్వహించాలని కోరారు. ఉద్యోగ నియామకాల కోసం ఎదురుచూస్తున్న వారికి తక్షణమే నియామక ఉత్తర్వులు ఇవ్వాలని, విజిలెన్స్, మారుపేర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.54 వేల కోట్ల బకాయిలను వెంటనే రాబట్టాలని, కార్మికుల పేర్లపై చెల్లిస్తున్న ఆదాయపు పన్ను మొత్తాన్ని యాజమాన్యమే భరించి తిరిగి కార్మికులకు చెల్లించాలని కోరారు. గైర్హాజరు పేరిట కార్మికులను డిస్మిస్ చేయవద్దని, ఇప్పటికే జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకొని వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొత్త బొగ్గు గనుల కేటాయింపు కోసం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని కోరారు. ఈ సందర్భంగా జూలై 7న మాజీ మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న సింగరేణి పరిరక్షణ సదస్సుకు సంబంధించిన గోడపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వెంకీ, శివ, యాదగిరి, శ్రీను, కృష్ణ, ప్రభాకర్, మహేందర్, రాజ్‌కుమార్, వెంకటేష్, రాజేష్, తిరుపతి, దీక్షిత్, సతీష్, అనిల్, రమేష్, రాజేశం పాల్గొన్నారు.

## కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి




**ప్రజాపక్షం / మందమర్రి :** సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కేంద్ర నాయకులు ఎండి అక్బర్ అలీ, బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న సుమారు 350 మంది డిపెండెంట్లకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డును పాత విధానంలోనే నిర్వహించాలని, పెర్క్స్‌పై విధిస్తున్న ఆదాయ పన్నును యాజమాన్యమే భరించాలని, కార్మికుల సొంతింటి కలను నెరవేర్చే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. యాజమాన్యం పలుమార్లు స్ట్రక్చర్ మీటింగ్‌లు నిర్వహించినప్పటికీ వాటిలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని నాయకులు ఆరోపించారు. ప్రభుత్వం, యాజమాన్యం కలిసి కార్మిక సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. కార్మికుల హక్కుల కోసం పోరాడాల్సిన కొన్ని గుర్తింపు సంఘాలు యాజమాన్యానికి, ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ కార్మిక వర్గానికి అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ జనరల్ మేనేజర్ (పర్సనల్) మేనేజర్ సీహెచ్ అశోక్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నాలో ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ బ్రాంచ్ నాయకులు భీమనాథుని సుదర్శన్, ఇప్పకాయ లింగయ్య, తిరుపతి గౌడ్, కంది శ్రీనివాస్, పెద్దపల్లి బానయ్య, ఎగ్గేటి రాజేశ్వరరావు, సీవీ రమణ, పిట్ కార్యదర్శులు గాండ్ల సంపత్, మర్రి కుమారస్వామి, సీహెచ్‌పి శర్మ, హరి రామకృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైళ్లు గుర్తించిన పోలీసులు

**ప్రజాపక్షం / హాజీపూర్ :** హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న రెండు మొబైల్ ఫోన్లను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ సహాయంతో గుర్తించి బుధవారం బాధితులకు అప్పగించారు. హాజీపూర్‌కు చెందిన మల్లేష్, ప్రశాంత్ తమ వీవో కంపెనీకి చెందిన టీ3, టీ4 మోడల్ మొబైల్ ఫోన్లను పోగొట్టుకోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన హాజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సాంకేతిక పరిశోధన చేపట్టి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా పోయిన మొబైళ్లను సులభంగా గుర్తించే అవకాశం ఉందని పేర్కొన్నారు. సాంకేతిక ఆధారాలతో మొబైళ్లను గుర్తించి తమకు అందజేసినందుకు బాధితులు పోలీసుల సేవా దృక్పథాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ సిబ్బంది, బాధితులు పాల్గొన్నారు.



## బ్రతికుండగానే భార్య చిత్రపటానికి అంతిమ నివాళి

**ప్రజాపక్షం / హాజీపూర్ :** భర్తను హత్య చేయించిన భార్య చిత్రపటానికి కుటుంబ సభ్యులు బ్రతికుండగానే అంతిమ నివాళులు అర్పించి దశదిన కర్మ నిర్వహించారు. ఇటీవల హాజీపూర్ మండలంలోని గుడిపేటలో భార్య అక్రమ సంబంధం నేపథ్యంలో భర్తను చంపిన ఘటన రాష్ట్రస్థాయిలో సంచలనం సృష్టించింది. గత నెల 22న జరిగిన సాయిని కుమార్ హత్యతో ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. గ్రామానికి చెందిన లగిశెట్టి సురేందర్‌తో కుమార్ భార్య భారతీ అక్రమ సంబంధం పెట్టుకుని, భర్తపై ఇన్సూరెన్స్ చేయించి పన్నాగంతో హత్య చేయించింది. ఈ కేసులో నలుగురిని అరెస్ట్ చేసిన హాజీపూర్ పోలీసులు జైలుకు పంపించారు. బుధవారం కుమార్ దశదిన కర్మ సందర్భంగా భర్తను హత్య చేయించిన భార్య భారతీ బ్రతికి ఉన్నప్పటికీ ఆమె చిత్రపటానికి కూడా కుటుంబ సభ్యులు పిండం పెట్టి అంతిమ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కుమార్ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## డిగ్రీ కళాశాలలో రేపు జాబ్ మేళా

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 6వ తేదీన శనివారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ శాఖ సహకారంతో కళాశాలలోని ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలో బ్రాంచ్ మేనేజర్, కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల భర్తీ నిమిత్తం ఈ మేళా ఏర్పాటు చేస్తున్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కే. శ్రీదేవి, జిల్లా ఉపాధి కల్పనాధికారి బి.కిరణ్ కుమార్, కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ విభాగం ఇంచార్జ్ డాక్టర్ లక్ష్మి నరసింహం పాల్గొన్నారు.

## అగ్నివీర్‌గా ఎంపికైన సాయికి ఘన సన్మానం



**ప్రజాపక్షం / పెంచికల్‌పేట్ :** భారత సైన్యంలో అగ్నివీర్‌గా ఎంపికైన పోతేపల్లి గ్రామానికి చెందిన డోకే సాయిని బుధవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పెంచికల్‌పేట్ మండలంలోని పోతేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుర్గం పోషన్న ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు సాయిని సత్కరించారు. సాయి తల్లిదండ్రులను కూడా శాలువాలతో గౌరవించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామం నుంచి రెండో ప్రభుత్వ ఉద్యోగిగా ఎంపికైన సాయి సాధించిన విజయాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కష్టపడి చదివి, పట్టుదలతో లక్ష్యాలను సాధించడం ద్వారా మరిన్ని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అగ్నివీర్‌గా ఎంపిక కావడం కుటుంబానికే కాకుండా గ్రామానికే గర్వకారణమని పేర్కొన్నారు. యువతలో సేవ పట్ల ఆసక్తి పెంపొందేందుకు ఇటువంటి విజయాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుర్గం పోషన్న, ఉపసర్పంచ్ గిరుగుల చిన్నయ్య, పంచాయతీ కార్యదర్శి రాకేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## బొప్పారం గ్రామానికి పునఃప్రారంభమైన ఆర్‌టిసి బస్సు సేవలు

**ప్రజాపక్షం / కోటపల్లి :** కోటపల్లి మండలంలోని బొప్పారం, నాగంపేట్, కొండంపేట్ ప్రయాణికులకు కొన్ని ఏళ్ల తర్వాత ఆర్‌టిసి బస్సు సేవలు తిరిగి అందుబాటులోకి వచ్చాయి. బొప్పారం గ్రామానికి వచ్చిన బస్సును సర్పంచ్‌లు జెల్ల సమ్మక్క వెంకటస్వామి, విశాల్ ప్రసాద్ తివారి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ ప్రసాద్ తివారి హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ ప్రసాద్ తివారి మాట్లాడుతూ బొప్పారం గ్రామానికి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే రోడ్డు, బస్సు సౌకర్యం కల్పించిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ బస్సు సేవలు నిలిచిపోయాయని, ఇప్పుడు మళ్లీ ప్రజా ప్రభుత్వం వచ్చాక మంత్రి చొరవతో బస్సు సౌకర్యాన్ని పునఃప్రారంభించామని తెలిపారు. ప్రజలందరికీ రవాణా సౌకర్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఈ సేవలు పునరుద్ధరించినట్లు పేర్కొంటూ, మహిళా సోదరీమణులు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని.. విద్య, వైద్యం, రవాణా, తాగునీరు, సాగునీరు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.



## మహిళా సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం మంగళ్‌పహాడ్ గ్రామంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు బుధవారం స్థానిక సర్పంచ్ చేపూరి వీణా శ్రీనివాస్ గౌడ్ భూమిపూజ చేసి ఘనంగా ప్రారంభించారు. ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రె డ్డి సహకారంతో ఉపాధి హామీ పథకం కింద ఈ భవన నిర్మాణానికి రూ. పది లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో ఐకెపి సిబ్బంది, ఉప సర్పంచ్ బాబయ్యతో కలిసి సర్పంచ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. మహిళా సంఘాల బలోపేతానికి వారు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకోవడానికి ఈ భవనం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. భవన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యేకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలక వర్గ సభ్యులు, వీడీసీ ఛైర్మన్ శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సంఘాల అధ్యక్షులు, ఐకెపి సీసీ వినోద్, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదును ఉద్యమంలా నిర్వహించాలి

### మాజీ ఎమ్మెల్యే బిగాల

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదును బూత్ స్థాయి కార్యకర్తలు ఉద్యమంలా నిర్వహించాలని స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పట్ల బూత్ స్థాయి కార్యకర్తలు జాగ్రత్తగా వివరించాలని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. బుధవారం ఆర్ఎన్ ఫంక్షన్ హాల్‌లో నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై అవగాహన సభ్యత్వ సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే మన్మంత్ షిండే, మాజీ ఎమ్మెల్సీ వి.జిగౌడ్, కరీంనగర్ మాజీ మేయర్ రవిందర్ సింగ్‌లతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బూత్ ఇన్‌చార్జిలు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జాగ్రత్తగా ఉండాలన్నారు. బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వంలో ప్రతి ఒక్కరు శ్రద్దతో పాల్గొనాలన్నారు. ప్రస్తుతం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా నిజామాబాద్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తానని చెప్పి నిజామాబాద్ ప్రజలకు కనీస వసతులు రోడ్లు, తదితర అభివృద్ధి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని దీనికి ధన్‌పాల్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు 420 హామీలే అన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతు, బిఆర్ఎస్ పార్టీ విధానాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే కార్యకర్తలే బిఆర్ఎస్‌కు నిజమైన బలం అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దండు నీతు కిరణ్ శేఖర్, సిర్ప రాజు, ప్రభాకర్ రెడ్డి, సత్య ప్రకాష్, సుజిత్ సింగ్, నవీద్ ఇక్బాల్, మతీన్ డివిజన్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్చార్జిలు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామ ఉపాధి హామీ పని ప్రదేశాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులు గ్రామం నుంచి సుమారు 7 కిలోమీటర్ల దూరం ప్రయాణించి పనులకు హాజరవుతున్నప్పటికీ వారికి ప్రయాణ భత్యం అందించడం లేదని విమర్శించారు. కార్మికులకు మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు, నీడ సదుపాయం వంటి ప్రాథమిక వసతులు కల్పించాలని కోరారు. రెండు ఫోటోలు తీసే విధానం కారణంగా కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వి.బి.జి. రాంజీ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధి హామీ పథకానికి ప్రస్తుతం అమలులో ఉన్న 60:40 నిధుల విధానాన్ని మార్చి, అవసరమైన నిధులను 100 శాతం కేంద్ర ప్రభుత్వమే భరించాలన్నారు. సంవత్సరానికి కనీసం 200 రోజుల ఉపాధి కల్పించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజువారీ కూలీని రూ.600 నుంచి రూ.800 వరకు పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున కార్మికులకు సన్‌షేడ్లు, వైద్య సదుపాయాలు, పనిముట్లు అందించి వారి ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొర్కుడ్ రాజేందర్, వినోద్, శ్రీనివాస్, ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

## 5న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్–2026ను ఈనెల 5న కాగజ్‌నగర్‌లోని బాలభారతి హైస్కూల్‌లో నిర్వహించనున్నారు. ముత్తు బాక్సింగ్ క్లబ్ కాగజ్‌నగర్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సహకారంతో ఈ పోటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ జిల్లా స్థాయి ఎంపికల్లో అండర్–15 విభాగానికి ఎంపికైన క్రీడాకారులు జూన్ 12, 13 తేదీల్లో హైదరాబాద్ ఉప్పుగూడలోని నరేంద్ర స్టేడియంలో తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ నిర్వహించే రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశం పొందుతారు. ఈ పోటీల్లో 2014, 2015, 2016 సంవత్సరాల్లో జన్మించిన కబ్ విభాగం, 2012, 2013లో జన్మించిన సబ్ జూనియర్ విభాగం, 2010, 2011లో జన్మించిన జూనియర్ విభాగాలకు చెందిన బాలురు, బాలికలు పాల్గొనవచ్చని అసోసియేషన్ నాయకులు తెలిపారు. పోటీలకు సంబంధించిన వివరాల కోసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్. శేఖర్‌ను 9177112942 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమ నిర్వహణలో ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు ఎమ్. విజేందర్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు వి. మధు, చైర్మన్ శివ కుమార్ నాయర్ పాల్గొంటున్నారు.

## వరి కొయ్యలు కాల్చితే భారీ జరిమానాః రైతులకు ఎడిఎ కృష్ణ హెచ్చరిక




**ప్రజాపక్షం/ జన్నారంః** పంట పొలాల్లో వరి కొయ్యలు (పంట వ్యర్థాలు) ఇతర పంట అవశేషాలను కాల్చడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై చింతగూడ రైతు వేదికలో బుధవారం రైతులకు మంచిర్యాల డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడిఏ) కృష్ణ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు వాటి ద్వారా కలిగే ఫలితాలను అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడిఏ కృష్ణ మాట్లాడుతూ, వరి కొయ్యలు, ఇతర పంట వ్యర్థాలను కాల్చడం వల్ల నేలలో పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవులు నశిస్తాయని తెలిపారు. దీంతో నేలలో సేంద్రీయ కర్బన శాతం తగ్గి భూమి గట్టిగా మారుతుందని, తద్వారా పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే, పంట పొలాల్లో మంటలు పెట్టడం వల్ల నేల కాలుష్యంతో పాటు వాతావరణ కాలుష్యం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రైతులు పంట అవశేషాలను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంట పొలాల్లో మంటలు పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుని రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు భారీ జరిమానా విధించబడుతుందని రైతులకు హెచ్చరించారు. ఎక్కడైనా మంటలు కనిపించిన వెంటనే సంబంధిత అధికారులకు లేదా అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్, చింతగూడ వ్యవసాయ విస్తరణ అధికారి లవన్ కృష్ణ, పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## గుండె జబ్బు బాధితునికి ఆత్మీయ ట్రస్ట్ ఆర్థిక సాయం

**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ :** గుండె జబ్బుతో బాధపడుతున్న నిరుపేద కూలీకి ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకుంది. రామకృష్ణాపూర్ పట్టణంలోని జ్యోతినగర్‌కు చెందిన పాండురాజు రాయమల్లు గుండెలో మూడు కవాటాలు మూసుకుపోవడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాల్సి ఉందని, అందుకు రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. రోజువారీ కూలి పనులు చేసుకునే రాయమల్లు కుటుంబానికి అంత ఆర్థిక స్తోమత లేకపోవడంతో వారు ఆత్మీయ చారిటబుల్ ట్రస్టును ఆశ్రయించారు. బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ట్రస్ట్ సభ్యులు జ్యోతినగర్‌లోని రాయమల్లు నివాసానికి వెళ్లి పరామర్శించారు. ట్రస్ట్ తరఫున రూ.10,000 నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ దాతలు ఎవరైనా ముందుకు వచ్చి రాయమల్లుకు మరికొంత ఆర్థిక సహాయం అందించి ప్రాణాలు కాపాడాలని కోరారు. మానవతా దృక్పథంతో ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుంకరి మల్లేష్, సభ్యుడు సట్ల మహేందర్, పట్టణ రజక సంఘ అధ్యక్షుడు నడిగోట తిరుపతి, రఘు పాల్గొన్నారు.




## నిజాంషుగర్ ఫ్యాక్టరీ కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలి

**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ పట్టణంలోని నిజాంషుగర్ ఫ్యాక్టరీ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఫ్యాక్టరీ కార్మిక సంఘం నాయకులు కోరారు. బుధవారం నిజాం షుగర్ ఫ్యాక్టరీ గేటు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ కార్మికులు మాట్లాడుతూ.. నిజాం షుగర్ ఫ్యాక్టరీ లే ఆఫ్ పెట్టి 11సంవత్సరాల కాలం గడుస్తున్న నిజాం షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చెల్లించలేదని ప్రభుత్వాలు, మారిన కార్మికులను ఆదుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తానని హామీనిచ్చి ఆ హామీని విస్మరిస్తుందని మండిపడ్డారు. ఇకనైనా స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజాం షుగర్ ఫ్యాక్టరీ కార్మికులను ఆదుకొని ఫ్యాక్టరీని పునః ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయులు ఉపేందర్, రవి శంకర్ గౌడ్, బాలకృష్ణ, రాజారాం, దేవదాసు కార్మికులు బాలచందర్, భాస్కర్, బిక్షపతి, భూమయ్య శ్రీధర్ పాల్గొన్నారు.

## మండలకాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా లక్ష్మణ్



**ప్రజాపక్షం/భీమ్‌గల్:** మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా మండల కేంద్రానికి చెందిన మల్లెల లక్ష్మణ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కాట్‌పల్లి నగేష్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ఈ నియామక ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని డీసీసీ స్పష్టం చేశారు.

## అగ్నివీర్‌కు కిసాన్‌నగర్ యువకుడు




**ప్రజాపక్షం/బాల్కొండ :** మండలంలోని కిసాన్‌నగర్‌కు చెందిన పంకజ్ ఆర్మీ లో ఉద్యోగం సాధించారు. గ్రామానికి చెందిన విజ య్, షీలా దంపతుల కుమారుడైన పంకజ్ కిసాన్‌నగర్‌లో ప్రభుత్వపాఠశాలలో 10వ తరగతి చదివాడు . అనంతరం తేజస్ అకాడమీ ఆర్మీ ట్రేడింగ్ సాయి ఓకేషనల్ ఆర్మూర్‌లో ఆర్మీ కోర్స్ చదివాడు. తన కుమారుడు దేశ సేవకు ఎంపిక కావటంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ఆర్మీ ఉద్యోగం సాధించిన పంకజ్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## ఎస్ఐఆర్ మ్యాపింగ్‌కు రాజకీయ పార్టీలు సహకరించాలి

### తహసీల్దార్ దత్తాత్రి

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని మండల ఎన్నికల అధికారి, తహసీల్దార్ దత్తాత్రి కోరారు. బుధవారం ఎడపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించడమే తమ లక్ష్యమన్నారు. బీఎల్‌వోలు నిర్వహించే ఇంటింటి సర్వే విజయంతం కావడంలో రాజకీయ పార్టీల పాత్ర కీలకమన్నారు. విదేశాల్లో లేదా ఇతర రాష్ట్రాల్లో ఉండేవారి తరపున వారి కుటుంబ పెద్దలు ఫారం నింపి బిఎల్‌వో కు సమర్పించవచ్చని తెలిపారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాముఖ్యత ఫారాలను నింపే విధానంపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## బీరెల్లిలో ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

ప్రజాపక్షం/తాడ్వాయి:తాడ్వాయి మం డలం బీరెల్లి గ్రామంలో బొడ్రాయి 3వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఈ పండగను పురస్కరించుకొని గ్రామస్తులంతా కలిసి దేవతా విగ్రహాలకు జలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేసి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాలలో స్థిరపడిన ఊరి ప్రజలందరూ తరలిరావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. బంధుమిత్రులు ఆడబిడ్డల రాకతో బీరెల్లి గ్రామం మొత్తం పండగ శోభను సంతరించుకుంది. సాయంత్రం మైసమ్మ కొలువు బలిహరణ రాత్రి ఊరు కట్టడి చేసారు. గ్రామ దేవత ఆశీస్సులు అందరిపై ఉండాలని, ఊరంతా ఆయురోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో పాడి పంటలతో విలసిల్లాలని గ్రామ పెద్దలు, ఊరంతా తల్లులను వేడుకున్నారు.

## కాళేశ్వరం పంచాయతీ కార్యదర్శి బదిలీ

ప్రజాపక్షం/కాళేశ్వరం:జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణను మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలానికి బదిలీ చేసారు.ఆయన స్థానంలో పలిమెల మండలంలో పని చేసిన శ్రీధర్‌ను కాళేశ్వరం పం చాయతీ కార్యదర్శిగా నియమించారు.సత్యనారాయణగత నాలుగు సంవత్సరాలుగా కాళేశ్వరం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

## బాధిత కుటుంబానికి ఎర్రబెల్లి పరామర్శ

ప్రజాపక్షం/పాలకుర్తి: మండల కేంద్రానికి చెందిన కమ్మగాని వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే కుటుంబ పెద్దను కోల్పోవడం బాధాకరమని అన్నారు. కష్ట సమయంలో తాము అండగా ఉంటామని ఆయన అన్నారు. ప్రజల కష్ట సుఖాలలో తాను అండగా ఉంటానని ఎవరు అధైర్యపడవద్దని ఆయన అన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులున్నారు.

## చిన్నారులకు బాసటగా అమ్మ చారిటబుల్ ట్రస్ట్



ప్రజాపక్షం/పాలకుర్తి: మండలంలోని ఎల్లరాయిని తొరూర్ గ్రామానికి చెందిన సోమ నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులను పరామర్శించి ట్రస్ట్ తరుపున పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని ధైర్యం చెప్పి, బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ యతి పతి శ్రీకాంత్, జనరల్ సెక్రటరీ హరీష్, కోశాధికారి ఒర్రె కుమారస్వామి, ఉప సర్పంచ్ గోనె కిరణ్ మృతుని కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకోవాలి

ప్రజాపక్షం/రామగిరి : పర్యావరణాన్ని కాపాడుకోవాలని రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్‌మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజా పాలన,ప్రగతి ప్రణాళిక యాక్షన్ ప్లాన్ లో భాగంగా జూన్1 నుండి 12 వరకు వివిధ సంస్థలకు పర్యావరణం పై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది.ఇట్టి కార్యక్రమాన్ని బుధవారం ఆర్ జి3, ఏపీపీ జిఎం కార్యాలయం నందు నిర్వహించారు.మంథని అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ దేవదాస్ కార్యాలయ అధికారులకు,ఉద్యోగులకు పర్యావరణం పై అవగాహన కల్పించారు.సింగరేణి సంస్థ ప్రతి సంవత్సరం తమ వంతు బాధ్యతగా ఎన్నో లక్షల మొక్కలను నాటుతుందని అందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు.ఇట్టి కార్యక్రమానికి రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్‌మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ, ప్రతి సంవత్సరం మొక్కలను నాటాలని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ప్రతి సంవత్సరం సింగరేణి సంస్థ నాటుతున్న మొక్కల వివరాలను తెలిపారు.కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ కె.యాదయ్య, ఎస్వోటుజియలు బండి సత్యనారాయణ, బి.వి.సత్య నారాయణ, పర్యావరణాధికారి రాజారెడ్డి, విభాగధిపతులు బి.టి.మురళీ కృష్ణ, బి.సుదర్శనం,అప్సర్ పాష,రాజేశ్వరి, శ్యామల, అటవీశాఖ అధికారులు మంగీలాల్, శ్రీకాంత్,వరప్రసాద్ తో పాటు ఇతర అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.




# బెస్ట్ అప్రిసియేషన్ సర్టిఫికెట్ ప్రదానం

ప్రజాపక్షం/పెద్దపల్లి : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి గోదావరిఖని జి.ఎం కాలనీ గ్రౌండ్ లో జరిగిన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని సి.హెచ్.పి వన్ లో పిట్టర్ గా విధులు నిర్వహిస్తున్న మెగావత్ సర్దార్‌కు బెస్ట్ అప్రిసియేషన్ సర్టిఫికెట్‌ను ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ కార్మికులు, ఉద్యోగులు రక్షణ తో కూడిన బొగ్గు ఉత్పత్తి ని సాధించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటూ తెలంగాణ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా వేడుకల్లో హాజరైన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆర్జీ వన్ అధికారులు రాంమోహన్ రావు, పైడీశ్వర్, గుర్తింపు సంఘం ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను,నాయకులు ఎస్ వెంకట్ రెడ్డి, బుడిమె సమ్మయ్య లు పాల్గొన్నారు.




## బదిలీ పై వెళ్తున్న ఏరియా ఇంజనీర్లలకు ఆత్మీయ సన్మానం

ప్రజాపక్షం/రామగిరి : రామగుండం3 ఏరియా లో ఏరియా ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తూ ఎస్టిపిపి పవర్ ప్లాంట్ బదిలీ పై వెళ్తున్న వి.వి.సుధాకర్ రెడ్డి, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తు కార్పోరేట్ భూగర్భ గనుల విభాగానికి బదిలీపై వెళ్తున్న కె. యాదయ్య లను రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు బుధవారం జిఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు,అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరియాలో విధేయతతో,అంకిత భావంతో వారు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు.కార్యక్రమంలో ఎస్వోటుజియలు బి.వి.సత్య నారాయణ, బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, ప్రవీణ్ వి ఫాంటింగ్, కె. జనార్దన్, విభాగాధిపతులు కాశీ విశ్వేశ్వర రావు, రాజేంద్ర కుమార్, బి.టి.మురళీ కృష్ణ, రాజారెడ్డి, రాజేశ్వరి,రవి చరణ్,సునీల్ ప్రసాద్‌తో పాటు ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేద పద్మశాలీ యువకుడి అత్యుత్తమ ప్రతిభ

ఎంసెట్ లో 63వ ర్యాంక్,ఐఐటిలో 900వ ర్యాంక్ * మెయిన్స్ ఓపెన్ కేటగిరిలో 1258వ ర్యాంకు

ప్రజాపక్షం/హనుమకొండ : నిరుపేద పద్మశాలి యువకుని ప్రతిభను గుర్తించారు నారాయణ విద్యాసంస్థలు. యువకుని తెలివితేటలు, చదువుల్లో అసాధారణ ప్రతిభను గుర్తించిన నారాయణ విద్యాసంస్థలు యువకునికి ఉచితంగా ఇంటర్మీడియట్ విద్యను అందించి ఆణిముత్యంగా తీర్చిదిద్దగా శ్రీ వర్ధన్ కు తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర, జిల్లా సంఘ నేతలు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ జిల్లా కాశిబుగ్గకు చెందిన సాంబారి కల్పన చంద్రమోహన్ ల పెద్ద కుమారుడు సాంబారి శ్రీ వర్ధన్ ది నిరుపేద పద్మశాలి కుటుంబం.తండ్రి చంద్రమోహన్ వరంగల్ లోని ఓ చికెన్ సెంటర్లో గుమస్తాగా పని చేస్తుండగా తల్లి గృహిణి.పదవ తరగతి ఫలితాల్లో 10/10 అత్యధిక మార్కులు సాధించగా శ్రీ వర్ధన్ ప్రతిభను గుర్తించిన నారాయణ విద్యాసంస్థలు హైదరాబాదులోని అన్నోజిగూడ సింగపూర్ సిటీ బ్రాంచ్‌లో రెండేళ్లపాటు ఉచితంగా ఇంటర్మీడియట్ విద్యను అందించారు. చదువుల్లో దిట్ట ఆయన శ్రీ వర్ధన్ ఇటీవల వెలువడిన ఐఐటి ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో 900 ర్యాంకు, ఒబిసికేటగిరీలో 154 ర్యాంకు సాధించారు. అలాగే ఎంసెట్ 2026 ఫలితాల్లో 63వ ర్యాంకు, మెయిన్స్ ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో 1258వ ర్యాంక్, ఒబిసికేటగిరీలో 220వ ర్యాంక్ సాధించి ఔరా అనిపించాడు.



## గుంతలమయంగా మారిన పూర్వకాలపు సిసి రోడ్లు

కొత్తగా సి సి రోడ్లు వేయాలని గ్రామస్తుల వేడుకోలు

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో అంతర్గత సిసి రోడ్లు పూర్తిగా చెడిపోయి గుంతలను తలపిస్తున్నాయి.చాలా సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ రోడ్లు కాలక్రమేణా అరిగిపోయి,లోపలి కంకర తేలి ప్రయాణానికి వీలు లేకుండా మారాయి.నిత్యం ఈ దారుల గుండా నడిచే వృద్ధులు,చిన్నపిల్లలు,వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పాతకాలపు సిసి రోడ్లను పూర్తిగా తొలగించి,వాటి స్థానంలో కొత్త సిసి రోడ్లను నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి,గ్రామానికి కొత్త రోడ్లు మంజూరు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## వ్యవసాయ విస్తరణ అధికారిగా శశిధర్ బాధ్యతలు స్వీకరణ



ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మైదంబండ క్లస్టర్ పరిధిలో నూతన వ్యవసాయ విస్తరణ అధికారిగా బి.శశిధర్ బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడ గత కొంతకాలంగా విధులు నిర్వహించిన జి. హారిక బదిలీపై మంథనికి వెళ్లారు. ఆమె స్థానంలో పాలకుర్తి మండలంలో పనిచేసిన బి. శశిధర్ ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ.. క్లస్టర్ పరిధిలోని రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ పథకాలు,ఆధునిక వ్యవసాయ విధానాలను అందిస్తూ రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## పుష్కరాల్లో పోయిన ఫోన్ అప్పగించి

ప్రజాపక్షం/ముత్తారం : కాళేశ్వరం సరస్వతి అంత్య పుష్కరాల్లో వరంగల్‌కు చెందిన మోరే మహేందర్ పోగొట్టుకున్న స్మార్ట్ ఫోన్ పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రానికి చెందిన బత్తుల రాములు అనే వ్యక్తికి దొరికింది. అతడు ఏమాత్రం దురాశ పడకుండా రాములు శ్రమించి బాధితుడి వివరాలు తెలుసుకుని,ఫోన్‌ను భద్రంగా అప్పగించారు.ఫోన్ తిరిగి దొరకడంతో మహేందర్ దంపతులు రాములుకు కృతజ్ఞతలు తెలిపారు.రాములు చూపిన నిజాయితీ,మానవత్వాన్ని స్థానికులు,ప్రముఖులు అభినందించారు.

## ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో ఆయా పోస్టులకు దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచ్చుపేట,కేసనపల్లి గ్రామాల్లోని ప్రీప్రైమరీ పాఠశాలల్లో 2026,27 విద్యా సంవత్సరానికి గాను 10 నెలల తాత్కాలిక ప్రాతిపదికన ఆయాలుగా పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ముత్తారం మండల విద్యాధికారి ఎన్.హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత,సాధారణ పరిమితి18 నుండి 44 సంవత్సరాలు గల ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను,సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్లను జతచేసి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేయాలన్నారు.

## శాత్రాజూపల్లిలో అగ్నిప్రమాదం..

ప్రజాపక్షం/వేములవాడ : వేములవాడ మున్సిపల్ శాత్రాజూపల్లి పరిధిలోని పరంపోగు ప్రాంతంలో జరిగిన అగ్నిప్రమాదంలో పెద్ద సంఖ్యలో ఈత, తాటి చెట్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంతో గీత కార్మికుల జీవనాధారం తీవ్రంగా దెబ్బతింది. అనేక సంవత్సరాలుగా గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు ఉపాధిని కోల్పోయి ఆందోళన చెందుతున్నాయి. ఈ ఘటనపై గౌడ సంఘం అధ్యక్షులు విక్కుర్తి నారాయణ గౌడ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదం వల్ల గీత కార్మికులకు అపార నష్టం వాటిల్లిందని, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి బాధిత గీత కార్మికులకు తగిన ఆర్థిక సహాయం అందించాలని ఆయన కోరారు. అలాగే దగ్ధమైన ఈత, తాటి చెట్ల పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనతో గ్రామ ప్రజలు కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి, వారి ఉపాధి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.